క్లుప్తంగా

డీవైఈఓ కార్యాలయ జేఏ బదిలీ



విద్యాసాగర్‌ను అభినందిస్తున్న డీవైఈఓ

రామచంద్రపురం: రామచంద్రపురం డీవైఈఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న పానుగంటి విద్యాసాగర్ మంగళగిరిలోని కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యాలయానికి విధులపై వెళ్తున్న విద్యాసాగర్‌ను డీవైఈఓ బి.కార్తికేయ, సిబ్బంది మంగళవారం అభినందన వీడ్కోలు పలికారు.

ఒకేషనల్ ల్యాబ్‌కు కుర్చీల వితరణ



కుర్చీలు బహూకరిస్తున్న భవానీదేవి

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్ ఒకేషనల్ ల్యాబ్‌లో కంప్యూటర్లకు అవసరమైన 12 కుర్చీలను పాఠశాల సైన్స్ ఉపాధ్యాయురాలు చల్లా భవానీదేవి తన తల్లి లక్ష్మీరమణ పేరున మంగళవారం పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం సీహెచ్ రత్నపద్మావతి, ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్లు రెడ్డి కనక రాజశేఖర్, కల్యాణి, ఉపాధ్యాయులు అరవ విస్సు, విఠల్, సత్తిబాబు, పిల్లి రాంబాబు, గుణ్ణం సత్తిబాబు, పి.మెహర్ సుజాత, ఉమాపతిశాస్త్రి, సునీత, జిల్లా సైన్స్ అధికారి గిరజాల వెంకట సత్యసుబ్రహ్మణ్యం ఆమెను అభినందించారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

కాజులూరు: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల స్థాయి సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఐ.రత్నరాజు తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో మాట్లాడుతూ ఈ నెల ఆరు నుంచి 27వ తేదీ వరకూ మండలంలోని 26 గ్రామాల్లో సామాజిక తనిఖీ గ్రామసభలు నిర్వహించినట్టు వివరించారు. ఆయా గ్రామాల నుంచి వచ్చిన నివేదికలపై చర్చించేందుకు బుధవారం ఉదయం పది గంటల నుంచి ఈ ప్రజావేదిక నిర్వహిస్తున్నామన్నారు.

చంద్రశేఖర్ ఆజాద్‌కు ఘన నివాళి



ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

రామచంద్రపురం: ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక పిల్లా వారి హైస్కూల్ ఆవరణలో మంగళవారం చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. పీవైఎస్ జిల్లా కార్యదర్శి వెంటపల్లి భీమశంకరం, పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లాల నాయకుడు బి.సిద్ధూ మాట్లాడుతూ దేశం కోసం ప్రాణత్యాగం చేసిన చంద్రశేఖర్ ఆజాద్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కేవీవీ సత్యనారాయణ, జేవీవీ పట్టణ ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, ఉపాధ్యాయులు రామకృష్ణ, కుమారి, పీవైఎల్ జిల్లా కార్యదర్శి వి.చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు సయ్యద్ షాబాజ్ ఔలియా ఉర్సు



సయ్యద్ షాబాజ్ ఔలియా దర్గా

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో ఉన్న హజ్రత్ సయ్యద్ షాబాజ్ ఔలియా బాబా దర్గా ఉర్సు మహోత్సవం బుధవారం జరుగుతుంది. సాయంత్రం 5 గంటలకు గంధోత్సవం, ఫాతెహా ఖానీ తదితర కార్యక్రమాలు ఉంటాయని దర్గా ముతవల్లి మహమ్మద్ కాలేషా మస్తాన్‌వలీ మంగళవారం విలేకరులకు తెలిపారు. ద్రాక్షారామ, పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివస్తారని చెప్పారు.

అధరహో..

- వేసవికి ముందే వెలసిన పుచ్చకాయల దుకాణాలు
- మార్కెట్‌లో డిమాండ్‌తో పాటు ధర ఎక్కువే



రాయవరం: పచ్చ పచ్చని పుచ్చకాయని చూస్తే నోరూరుతుంది. మండుటెండలో ఓ పుచ్చకాయ(వాటర్‌మిలాన్) ముక్క తింటే ఎంతో హాయిగా ఉంటుంది. ఈ పచ్చకాయను చిన్నారుల నుంచి పెద్దవాళ్ల వరకూ అందరూ ఇష్టపడతారు. ఈ పుచ్చకాయలు వేసవిలో ఎక్కువగా కనిపిస్తాయి. అయితే ఈ ఏడాది వేసవి రాకుండానే మార్కెట్‌లో దర్శనమిస్తున్నాయి. ధర కూడా అదే స్థాయిలో ఉంది. గతంలో మార్చి ప్రారంభం నుంచి అమ్మకాలు ఉండేవి. అయితే ఫిబ్రవరి రెండో వారం నుంచే పుచ్చకాయల అమ్మకాలు ప్రారంభమయ్యాయి. ఇప్పుడు ఎక్కడ చూసినా పుచ్చకాయల విక్రయ షాపులే కనిపిస్తున్నాయి. రోడ్డుకిరువైపులా ఉంటున్నాయి.

పెరుగుతున్న విక్రయాలు..

పండ్లు ఆరోగ్యానికి మంచిదని వైద్యులు సూచించడంతో ఇటీవల వాటినే ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. వేసవిలో ఎక్కువగా వచ్చే పుచ్చకాయకు అదే తరహాలో డిమాండ్ ఏర్పడుతోంది. పుచ్చకాయలో కూడా ఔషధగుణాలు ఉండడంతో పాటు వేసవిలో దాహార్తిని తీరుస్తుంది. అయితే ప్రస్తుతం పుచ్చకాయ మాత్రం ప్రారంభంలోనే ధర అధరగొడుతోంది. ప్రస్తుతం చెన్నై, నెల్లూరు నుంచి పుచ్చకాయలను దిగుమతి చేసుకుంటున్నారు. టన్ను రూ.18వేల వరకు ధర పలుకుతోంది. సైజును బట్టి ఒక్కో కాయ రూ.100 నుంచి రూ.150 వరకు ధర ఉంటోంది. ధరలు బాగుండడం, పగటి వేళ ఎండ పెరగడంతో రహదారి పక్కన స్టాల్స్ ఏర్పాటు చేసుకుని విక్రయాలు ప్రారంభించేశారు. వీటిని చిన్న చిన్న ముక్కలుగా కోసి సైజును బట్టి రూ.10, రూ.20 వంతున వ్యాపారులు విక్రయాలు చేస్తున్నారు. షుగర్ బేబి(మహారాష్ట్రలో అమెరికా రకం), నాందారి(మన రాష్ట్రంలోని రకం), ఆర్క్‌మెన్ తదితర రకాలున్నా నాందారి, మధుబాల రకానికే డిమాండ్ ఎక్కువగా ఉంది.

పోషకాలెన్నో..!

పుచ్చలో బీ విటమిన్, పొటాషియం పుష్కలంగా ఉంటాయి. ఎలక్ట్రోలైట్లు సమృద్ధిగా లభిస్తాయి. పుచ్చకాయలో కొలెస్ట్రాల్ ఉండదు. వీటి వల్ల శక్తితో పాటు ఒంటికి మేలు చేయడం దీనినైజం, శరీరానికి కొత్తశక్తిని ఇస్తుంది. పుచ్చకాయలో 92 శాతం ఆల్కలైన్, నీళ్లతో పాటు పీచు పదార్థాలు ఉంటాయి. ఇవి శరీరానికి, మూత్రపిండాలకు, మూత్రనాళాలకు ఎంతో ఉపయోగకరం ఉంటాయి. పుచ్చకాయ తినడం వలన మలబద్ధకం నివారణవుతుంది. ఇందులో ఉండే పీటాకెరోటిన్ రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. వద్ధాప్యంలో వచ్చే అంధత్వ సమస్యను నివారిస్తుంది. కిడ్నీలో రాళ్లు ఉన్నవారికి కూడా ఎంతో ఉపయోగపడుతుంది. ఆస్మా, మధుమేహం, ఆర్థరైటిస్ సమస్యలకు బాగా పనిచేయడంతో పాటు సక్రమంగా రక్తప్రసరణ జరిగేలా చేస్తుంది. అంతేకాకుండా పుచ్చకాయ సౌందర్యానికి కూడా ఉపకరిస్తుంది. 100 గ్రాముల పుచ్చకాయలో 91.45 గ్రాముల నీరు, ఆరు శాతం చక్కెర, 30 కేలరీల శక్తి, 7.6 గ్రాముల పిండి పదార్థాలు, 0.6 గ్రాముల మాంసకృత్తులు, పొటాషియం 12, కాల్షియం ఏడు, సోడియం ఒక మిల్లీగ్రాము వంతున ఉంటుంది.

క్లస్టర్ పరిధిలో..

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గంలోని మండపేట, రామచంద్రపురం పట్టణాలతో పాటుగా మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల్లో పలు చోట్ల పుచ్చకాయ షాపులు వెలిశాయి. రాయవరం, పసలపూడి, మాచవరం, మండపేట, ద్వారపూడి తదితర గ్రామాల్లో రహదారి పక్కన షాపులు ఏర్పాటు చేశారు. రహదారి వెంబడి ప్రయాణించే వారు షాపుల వద్ద ఆగి దాహార్తిని తీర్చుకోవడం కోసం పుచ్చకాయ ముక్కలు తీసుకుంటున్నారు. కొందరు పుచ్చకాయలను కొనుగోలు చేసి, ఇంటికి తీసుకుని వెళ్తున్నారు.



దాహార్తిని తీర్చుకోవడానికి పుచ్చకాయ ముక్కలు తింటున్న ప్రయాణికులు

ధర ఎక్కువే..



ప్రస్తుతం మార్కెట్లో పుచ్చకాయ ధర ఎక్కువగానే పలుకుతోంది. ఇంటిల్లిపాదీ పుచ్చకాయ తినడానికి కొనుగోలు చేయాలంటే సామాన్యులకు అందుబాటులో ఉండడం లేదు. అయినా దాహార్తిని తీర్చుకోవడానికి తినక తప్పడం లేదు.

– అంపోలు కృష్ణమూర్తి, చిరుద్యోగి, వెదురుపాక, రాయవరం మండలం

అందుకే ఇష్టపడతాం



వేసవిలో దాహార్తిని తీర్చుకోవడానికి చక్కని ఫలం పుచ్చకాయ. ధర ఎక్కువైనా వేసవిలో పుచ్చకాయ తినడం వలన దాహార్తి నుంచి తక్షణ ఉపశమనం పొందవచ్చు. అందుకే ప్రతి ఒక్కరూ పుచ్చకాయను ఇష్టపడతారు.

– ఎం.గంగరాజు, నిరుద్యోగి, కూర్మాపురం, రాయవరం మండలం

సమస్యపై స్పందించిన చైర్‌పర్సన్, కమిషనర్



డ్రైన్‌లో పూడిక తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్

కపిలేశ్వరపురం (మండపేట): పట్టణంలో నెలకొన్న మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, కమిషనర్ బి.రాము స్పందించారు. మండపేట దిబ్బగరువు ప్రాంతంలోని రామచంద్రుడు మెయిన్ కెనాల్ మున్సిపల్ డెడికేటెడ్ చానల్‌లోని చెత్త తొలగిపు పనులకు ఆదేశించారు. పట్టణంలోని ఆరో వార్డు సచివాలయాల పరిధిలోని డ్రైన్లు రామచంద్రుడు మెయిన్ కెనాల్‌లో కలుస్తాయి. మున్సిపల్ పారిశుద్ధ్య నిర్వహణ తనిఖీ అధికారి లావణ్య పర్యవేక్షణలో ప్లాస్టిక్ వ్యర్థాలు, పూడికను సిబ్బంది పొక్లెయిన్ సాయంతో తొలగించారు. సంబంధించిన పనులను మంగళవారం పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. చైర్‌పర్సన్ దుర్గారాణి మాట్లాడుతూ మున్సిపల్ పాలకవర్గం ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య చర్యలను చేపడుతుందన్నారు. చెత్త సమస్య పరిష్కారానికి ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నామన్నారు. కమిషనర్ రాము మాట్లాడుతూ డ్రైన్‌ల్లో వ్యర్థాలు పోరుకుపోవడంతో దోమల సమస్య తీవ్రత పెరుగుతుందన్నారు. చెత్తను డ్రైన్లలో వేయకుండా చెత్తను సేకరించే వాహనాలకు అందజేయాలని పట్టణ వాసులను కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చిట్టూరి సతీష్, పిల్లి శ్రీనివాస్, మున్సిపల్ ఈఈ కె.శ్రీనివాస్, ఏఈ కె.సత్యనారాయణ, శానిటేషన్ సెక్రెటరీలు, మేస్త్రులు పాల్గొన్నారు.

వలంటీర్లు.. సంక్షేమ రథ సారథులు



జగదీశ్వరికి సేవా వజ్ర అవార్డును అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నేత పృథ్వీరాజ్

రాయవరం: ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉన్న వలంటీర్లు సంక్షేమ రథ సారథులుగా నిలిచారని వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్ పేర్కొన్నారు. మండలంలోని చెల్లూరు గ్రామ పరిధిలో చింతా సుబ్బారాయుడు చారిటబుల్ ట్రస్టులో మంగళవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పసలపూడి వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు చింతా సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పృథ్వీరాజ్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే పరమావధిగా వలంటీర్లు సేవలందిస్తున్నారన్నారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలను ప్రజలకు చేరవేయడంలో వలంటీర్లదే కీలకపాత్ర అన్నారు. ప్రతి ఒక్కరికీ వజ్ర అవార్డులు పొందలేకపోయినప్పటికీ, సీఎం



కార్యక్రమానికి హాజరైన వలంటీర్లు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్లందరినీ వజ్రాల కంటే ఎక్కువగా గుర్తించి, గౌరవించారని అంతకంటే ఏమి కావాలన్నారు. వలంటీర్లపై జగనన్న పెట్టుకున్న నమ్మకాన్ని, వలంటీర్లందరూ ప్రజాసేవ చేయడం ద్వారా నిలబెట్టుకోవాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, ఉప సర్పంచ్ పోతంశెట్టి సాయిరామ్మోహన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు తదితరులు మాట్లాడారు. అనంతరం మండలంలోని కురకాళ్లపల్లి గ్రామానికి చెందిన రాయుడు జగదీశ్వరికి సేవా వజ్ర అవార్డు కింద రూ.45వేలు నగదు అందజేశారు. కోడూరి మంగాదేవి, సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి, తమలంపూడి పద్మప్రియ, సంగడాల సర్వందురాజు, కుందేటి అలేఖ్యలకు సేవా రత్న అవార్డుల కింద రూ.30 వేలు వంతున అందజేశారు. సేవా మిత్ర అవార్డుల కింద ఒక్కొక్కరికి రూ.15వేలు వంతున అందజేశారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు ఆరిఫ్, పార్టీ విప్ కర్రి విజేత, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధిక సంఖ్యలో పార్టీ నేతలు పాల్గొన్నారు.

నేడు వలంటీర్లకు వందనం కార్యక్రమం

కపిలేశ్వరపురం: అంగరలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద బుధవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు తెలిపారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లకు అవార్డుల ప్రదానం చేయనున్నామన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చేతుల మీదుగా వలంటీర్లను సత్కరిస్తారన్నారు.

ఈవీఎంల పనితీరుపై అవగాహన



రాయవరంలో ఈవీఎంల పనితీరుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

రాయవరం: స్థానిక శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో తహసీల్దారు ఆర్‌వీ కృష్ణారావు ఆధ్వర్యంలో ఈవీఎంల పనితీరుపై మహిళా ఉపాధ్యాయులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈవీఎంలు ఏ విధంగా పనిచేస్తాయి? వాటిని ఏ విధంగా ఉపయోగించాలి? అనే అంశాలపై మహిళా ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. మోడల్ ఈవీఎంను తీసుకుని, అది పని చేసే విధానం, ఈవీఎం ఉపయోగించిన తర్వాత, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాడ్ ఉపయోగించే విధానాన్ని వివరించారు. బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్లలో బ్యాటరీ అమర్చే విధానాన్ని వివరించారు. ఓటింగ్ ప్రారంభించే ముందు ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ ఏ విధంగా నిర్వహించాలనే అంశంపై అవగాహన కల్పించారు. 10 పోలింగ్ స్టేషన్లకు ఒక సెక్టోరల్ అధికారులను నియమించారు. ఇప్పటికే సెక్టోరల్ అధికారులుగా నియమించిన డి.చైతన్యకుమారి, డి.శ్రీనివాస్, వి.రామనారాయణ, పి.రామలక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణ, కొప్పిశెట్టి ప్రభాకర్‌లు ఈవీఎంల పనితీరుపై అవగాహన కల్పించారు.

ప్రజారోగ్య పరిరక్షణకు జగనన్న కృషి



రోగులకు మందుల కిట్‌ను పంపిణీ చేస్తున్న వైద్యులు

కాజులూరు: రాష్ట్రంలో ప్రజారోగ్య పరిరక్షణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని పల్లిపాలెం గ్రామ సర్పంచ్ వడ్లపాటి భాస్కరరావు అన్నారు. మంగళవారం పల్లిపాలెం సచివాలయంలో సర్పంచ్ భాస్కరరావు ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. దుగ్గుదుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారి వై.సుప్రియ, కాకినాడ ప్రభుత్వాస్పత్రి డాక్టర్లు రక్షిత, అనూష, జి.స్వాతి, వై.సుప్రియ, ఎస్.సత్తిబాబు తదితరులు 408 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి సుప్రియ మాట్లాడుతూ అవసరమైన వారికి చికిత్స, ఉచితంగా మందులు పంపిణీ చేశామని చెప్పారు. పది మందిని మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు పంపించామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మేడిశెట్టి శ్రీను, సచివాలయాల సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ వాయిదా

అమలాపురం టౌన్: స్థానిక కోర్టుల సముదాయ ప్రాంగణంలో వచ్చే నెల 9వ తేదీన జరగాల్సిన నేషనల్ లోక్ అదాలత్‌ను అదే నెల 16వ తేదీకి వాయిదా వేసినట్లు కోర్టు కార్యాలయం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను ఈ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని జిల్లా రెండో అదనపు కోర్టు న్యాయమూర్తి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ వి.నరేష్ సూచించారు. 16వ తేదీ ఉయం 10.30 గంటలకు లోక్ అదాలత్ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠ పూజలు



వల్లూరులో ప్రతిష్ఠ పూజల్లో భక్తులు

కపిలేశ్వరపురం: వల్లూరులోని భూదేవీ శ్రీదేవీ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠ పూజలు ఘనంగా జరిగాయి. అర్చకులు స్వామికి పూజలు హోమలు చేశారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, ఆలయ కమిటీ చైర్మన్ వల్లూరి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఖాతాకు పరిహారం సొమ్ము



యానాం: ఓఎన్‌జీసీ సంస్థ అందించిన వేట నష్టపరిహారం సొమ్ము ప్రభుత్వ ఖాతాలో మంగళవారం జమయ్యింది. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి లబ్ధిదారుల జాబితాపై ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఆర్ఏఓ మునిస్వామిలు సమీక్షించారు. మొత్తం 5,462 మందికి గాను 173 మందిని మినహాయించి 5,289 మందితో కూడిన తుది జాబితాను యానాం మత్స్యశాఖ ఆధ్వర్యంలో పుదుచ్చేరి మత్స్యశాఖ ఉన్నతాధికారులకు పంపించనున్నారు. ఇప్పటికే ఆర్థిక శాఖ ఆమోదం ఇవ్వడంతో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో త్వరలో సొమ్ము జమవుతుందన్నారు.

ఆకట్టుకున్న జంతు ప్రదర్శన





జంతు ప్రదర్శనలో పెంపుడు కుక్కల విన్యాసాలు

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వ పరిధిలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ యానిమల్ హజ్బెండరీ అండ్ యానిమల్ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పశువుల ఆసుపత్రి ఆవరణలో నిర్వహించిన పశువులు, కోళ్లు, పెంపుడు కుక్కల ప్రదర్శన పోటీ అందరినీ ఆకట్టుకుంది. మెట్టకూరు, ఫ్రాన్స్‌తిప్ప, కురసాంపేట తదితర ప్రాంతాల నుంచి రైతులు, పలువురు ఔత్సాహికులు తమ కపిలజాతి ఆవులు, ఆవులు, గేదెలు, గొర్రెలు, కుక్కలు, కోళ్లు తదితర పెంపుడు జంతువులను ప్రదర్శనకు తీసుకొచ్చారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఆర్ఏఓ మునిస్వామిల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ జి.లతామంగేష్కర్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ కె.ఆంధ్రూ జాబా కుమార్, డాక్టర్ వెంకటరమణ, పువ్వల సత్యనారాయణమ్మ, చెక్కపల్లి శ్రీరామ్ పాల్గొన్నారు.

లోపాలు లేకుండా ఉపాధి పనులు

కొత్తపేట: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల్లో ఏమైనా స్వల్ప లోపాలుంటే సరిచేసుకుని, భవిష్యత్తులో చేపట్టే పనుల్లో వాటికి అవకాశం లేకుండా చేపట్టాలని డ్వామా పీడీ ఎస్ మధుసూదన్ ఆ శాఖ అధికారులు, సిబ్బందికి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని శ్రీకృష్ణదేవరాయ సభా ప్రాంగణంలో మంగళవారం మధ్యాహ్నం ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఎంపీడీఓ వాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డ్వామా పీడీ ఎస్ మధుసూదన్ పాల్గొన్నారు. 2022 ఏప్రిల్ ఒకటి నుంచి 2023 మార్చి 31 వరకూ మండలంలోని పది గ్రామాల్లో ఉపాధి పథకం ద్వారా ఈజీఎస్, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, సోషల్ ఫారెస్ట్ శాఖలకు సంబంధించి 355 పనులు చేపట్టగా, వేతనాల రూపంలో రూ.6,78,77,654, మెటీరియల్ రూపంలో రూ.2,07,97,968తో మొత్తం రూ.8,86,75,622 ఖర్చు చేశారు. ఆయా పనులపై గ్రామాల్లో విలేజ్ సోషల్ ఆడిటర్స్ (వీఎస్‌ఏ) తనిఖీలు జరిపి, నివేదికలు రూపొందించారు. సర్వే నివేదికలపై ప్రజావేదికలో పీడీ మధుసూదన్ గ్రామాల వారీగా సమీక్షించారు. వివిధ పనుల్లో పలు లోపాలను గుర్తించారు. వాటిలో ఉపాధి పథకానికి సంబంధించి రూ.2,468 రికవరీ చేయాలని, నేమ్‌బోర్డులు ఏర్పాటు చేయనందుకు విడుదల చేసిన మొత్తంలో రూ.92,400 తిరిగి చెల్లించాలని సూచించారు.

నూతన ఆవిష్కరణలతోనే బంగారు భవిష్యత్తు

- యువతలో విజ్ఞాన తృష్ణను పెంపొందించాలి
- నేడు జాతీయ సైన్స్ దినోత్సవం

యానాం: నాగలి నుంచి హరితవిప్లవం దాకా, చక్రం నుంచి విమానం దాకా, నిప్పు నుంచి అణుబాంబు దాకా, నాటకాల నుంచి త్రీడీ సినిమాల వరకూ, బ్లాక్ అండ్ వైట్ టీవీల నుంచి ఎల్ఈడీ టీవీల దాకా, ఉత్తరాల నుంచి సెల్‌ఫోన్, అంతర్జాలం వరకూ ప్రపంచం అత్యున్నత దిశగా అడుగులు వేసింది. నూతన ఆవిష్కరణలతో మానవుడి జీవన పయనం సుఖమయంగా మారింది. మనిషి చంద్రలోకాన్ని జయించి ఇలను ఇంద్రలోకంగా మార్చి ప్రపంచాన్ని అరచేతిలో బంధించాడు. సాంకేతిక, వైజ్ఞానిక రంగంలో ప్రగతి పథాన పురోగమిస్తూ మానవుడే మహనీయుడయ్యాడు. ఈ ఆధునిక మార్పులకు ప్రధాన కారణం సైన్స్‌లో నూతన ఆవిష్కరణలే.

సుస్థిర భవిష్యత్తు కోసం సైన్స్

భారతీయ వైజ్ఞానిక చరిత్రలో మరిచిపోలేని రోజు ఫిబ్రవరి 28. సరిగ్గా అదే రోజున 1928లో సీవీ రామన్ తన పరిశోధనా ఫలితాలను ప్రపంచానికి అందించారు. నేషనల్ కౌన్సిల్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ కమ్యూనికేషన్(ఎన్‌సీఎస్‌టీసీ) రామన్ ఎఫెక్ట్ కనిపెట్టిన రోజును నేషనల్ సైన్స్‌డేగా స్వీకరించడంతో ఫిబ్రవరి 28న సైన్స్ దినోత్సవం అయింది. రామన్ ఎఫెక్ట్ ద్వారా ఆకాశం నీలిరంగులో ఎందుకుంటుంది, ఆకాశంలో తారలు పగటి సమయంలో ఎందుకు కనిపించవు, సముద్రంలో నీరు నీలిరంగులో ఎందుకు కనిపిస్తుంది లాంటి ప్రశ్నలకు సూర్యకాంతి ద్వారా ఆయన చేసిన పరిశోధనల ద్వారా రామన్ జవాబు చెప్పారు. 1930లో ఆయన నోబెల్ బహుమతి అందుకున్నారు.



రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి సాధించిన చంద్రయాన్-3 ప్రాజెక్టు



యానాంలో వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

జాతీయ సైన్స్‌డే 2024 థీమ్ 'సుస్థిర భవిష్యత్తుకోసం సైన్స్'.. ఈ థీమ్ ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవడంలో, అందరికీ స్థిరమైన భవిష్యత్తును సృష్టించడంలో సైన్స్ అండ్ టెక్నాలజీ కీలపాత్రను స్పష్టం చేస్తుంది.

నవోదయ విద్యాలయ విద్యార్థుల ప్రతిభ

యానాం నవోదయ విద్యార్థులు సైన్స్ రంగంలో విశేష ప్రతిభ కనబరుస్తున్నారు. విద్యార్థి దుర్గేష్ తయారుచేసిన ప్రాజెక్టు అహ్మదాబాద్‌లో జరిగిన జాతీయ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్‌లో ప్రదర్శించారు. శరీర సౌష్టవ కొలతలు అనే అంశంపై ఆయన ప్రాజెక్టు తయారుచేశారు. అదేవిధంగా సహజసిద్ధ వనరులను ఉపయోగిస్తూ మేడాశివాజీ తయారుచేసిన రీసెర్చ్ బేస్డ్ ప్రాజెక్టుకు బహుమతి లభించింది. పండ్లు, కూరగాయలు వ్యర్థాల నుంచి మధుమేహం లాంటి వ్యాధులకు ఉపశమనం కలిగించే మందులు తయారుచేసే విధానాన్ని విద్యార్థి కౌషిక్ తయారుచేశారని ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు తెలిపారు.

రాష్ట్ర స్థాయికి చంద్రయాన్ ప్రాజెక్టు

స్థానిక రీజెన్సీ పబ్లిక్ స్కూల్ విద్యార్థి తోట కార్తికేయ తయారుచేసిన చంద్రయాన్-3 నమూనాను పుదుచ్చేరి రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన-2023లో ప్రదర్శించి బెస్ట్ సబ్ థీమ్ విభాగంలో బహుమతి సాధించాడు. అనంతరం సదరన్ లెవెల్ సైన్స్ ఫేర్ దక్షిణ భారత రాష్ట్రాల వైజ్ఞానిక ప్రదర్శన-2024లో సైతం ఎంపికైనట్లు హెచ్ఎం టీవీఎస్ఎస్‌వీ ప్రసాదరావు తెలిపారు.